# నేను మీరే, మీరు నేనే

*కష్టసుఖములు రెండును కలిసియుండు*
*వీని విడదీయు టెవ్వరి వశము కాదు*
*సుఖము ప్రత్యేకముగ నెందు చూడబోము*
*కష్టము ఫలించెనేని సుఖంబటండ్రు*

ప్రేమస్వరూపులారా!

ఇది నూతన సంవత్సరము. ఈవిధముగా నూతన సంవత్సరములు ఎన్నియో గడచిపోయినవి. కాని, మీ జీవితము మాత్రము పాతదిగానే ఉంటున్నది. దీనికి కారణమేమిటి? మీయందే ఉన్న దివ్యత్వాన్ని మీరు గుర్తించుకోలేకపోతున్నారు. దివ్యత్వము ప్రతి జీవియందు ప్రేమస్వరూపాన్ని ధరించియున్నది. ప్రేమే నిజమైన దైవస్వరూపం. ఇట్టి శాశ్వతమైన, సత్యమైన దివ్యత్వమును గుర్తించుకోవటానికి మీరు ప్రయత్నించాలి. ఇదియే మీ ప్రధానమైన కర్తవ్యం. ఈనాటి మానవుడు దివ్యత్వమును గురించి తెలుసుకోవాలని ఆశిస్తున్నాడు. దివ్యత్వాన్ని దర్శించాలని ధ్యానం చేస్తున్నాడు. కాని దివ్యత్వం తన ఇంటనే, వెంటనే, జంటనే ఉన్నదనే సత్యాన్ని గుర్తించలేకపోతున్నాడు. ధ్యానమంటే ఏమిటి? సత్యాన్ని అనుసరించటమే నిజమైన ధ్యానము. దివ్యత్వము తనయందే ఉన్నదనే సత్యాన్ని గుర్తించాలి. నిత్యమైన, సత్యమైన, అద్భుతమైన, ఆనందమయమైన ఆ దివ్యత్వము సర్వత్రా వ్యాపించి ఉన్నది. అట్టి సత్యాన్ని గుర్తించుకోవటమే మానవుని యొక్క ప్రధాన కర్తవ్యము. ప్రతి మానవుడు తాను సత్యాన్ని గుర్తించటానికి ప్రయత్నిస్తున్నానని చెబుతున్నాడు. కాని ఆ ప్రయత్నం ఫలించటం లేదు. తనయందే ఉన్న నిత్యసత్యమైన దైవత్వాన్ని తాను ఏరీతిగా చూడగలడు? సత్యము కంటే మించినది ఈ జగత్తులో మరొకటి లేదని తాను గుర్తించాలి.

ప్రేమస్వరూపులారా! దివ్యత్వము మీ ఇంటనే, వెంటనే, జంటనే ఉన్నది. మీ కంటికి కనిపించేదంతా దైవస్వరూపమే! కాని, దివ్యత్వము మీకంటికి కనిపించకుండా ఎక్కడో ఉన్నట్లు మీరు భావిస్తున్నారు. మీయందే ఉన్న దివ్యత్వాన్ని మరచి బయట వెతుకుతున్నారు. మీ ఇంటనే, వెంటనే, జంటనే, కంటనే ఉన్న దివ్యత్వం కోసం మీరు వెతకడమెందుకు? నిజంగా దైవాన్ని అన్వేషించనక్కర్లేదు. 'దైవాన్వేషణ' అనే పదము చాలా పొరపాటు. దైవాన్ని దర్శించాలని కొందరు యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణ, ధ్యాన, సమాధి ఇత్యాది అనేకరకములైన సాధనలు సల్పుతున్నారు. అసలు 'సమాధి' అంటే ఏమిటి? 'సమ-ధీ' అంటే, అన్నింటియందు సమత్వంగా ఉండే బుద్ధి. ఇట్టి పవిత్రమైన తత్త్వము అందరియందూ ఉన్నది. కేవలం సాధన చేసినవారికే ఇది లభించుననుకోవటం పెద్ద పొరపాటు. మీయందున్న దివ్యత్వమును గుర్తించటానికి మీరు ఏ సాధనలూ చేయనక్కరలేదు.

## 'నేను' అనేదే దివ్యత్వం

ప్రేమస్వరూపులారా! మీ తత్త్వాన్ని మీరు ఎక్కడైనా బయట వెతుకుతారా? అట్లు వెతికేవాడు మూర్ఖుడనే చెప్పవచ్చును. మీ యొక్క 'సెల్ఫ్'ని మీరు ఎక్కడైనా బయట చూడగలరా? మిమ్మల్ని మీరు చూసుకోవాలంటే మీయందే వెతకాలి. మీరు దేనికోసం వెతకాలనుకుంటున్నారో అది మీలోనే ఉన్నది. అట్టి పవిత్రమైన తత్త్వమును మీరు బయట వెతకటం ద్వారా మీ నుండి దూరం చేసుకుంటున్నారు. మీకోసం మీరు ఎక్కడెక్కడో వెతుకుతున్నారు. ఇలాంటి పిచ్చిమనస్సు గలవారికి యధార్థము ఎట్లా బోధపడుతుంది? మీయందు ప్రేమ ఉన్నది. ఆ ప్రేమను మీరు ఎక్కడినుండైనా కొనితెచ్చారా? మీరు 'నేను', అనే పదాన్ని

ఉపయోగపెడుతున్నారు. ఆ 'నేను' అనేది ఎక్కడినుండి వస్తున్నది? అది ఎక్కడినుండో రావటం లేదు. ఎక్కడికో పోవటం లేదు. 'రాకపోకలు లేనట్టి శాశ్వతుండు' అది మీయందే ఉన్నది. 'నేను' అనేదే దివ్యత్వం. కాని మీరు దేహమే 'నేన'ని భావించి సాధనలు సల్పుతున్నారు. ఈ విధమైన సాధనలలో కాలమును వ్యర్థం గావించుకునే బదులు 'నేను నేనే' అనే సత్యాన్ని గుర్తించండి. నిజంగా సాధన చేయటమంటే దేహాభిమానం త్యజించాలి. 'నేను నేనే' అనే సత్యాన్ని గుర్తించుకున్నవానికి ఇంక ఏ సాధనలూ అక్కర్లేదు. ప్రతి మానవుడూ తనలో ఉన్న సత్యాన్ని తాను గుర్తించుకోవడం అత్యవసరం. తాను వెతికే దివ్యత్వము తనయందే ఉన్నదనే సత్యాన్ని గుర్తించి వర్తించేవాడే నిజమైన సాధకుడు.

**'సర్వతః పాణి పాదం ....'**

ప్రాచీనకాలమునుండి అనేకమంది కృష్ణతత్త్వాన్ని గుర్తించాలని అనేక సాధనలు చేస్తూ వచ్చారు. కాని ఆ సాధనలేవీ ఫలించలేదు. కృష్ణుడెక్కడున్నాడు? దైవము ఎక్కడున్నాడు? నీయందే ఉన్నాడు. దివ్యత్వము తనయందు, తన చుట్టూ ఉన్నదన్న సత్యాన్ని గుర్తించలేనివాడు ఎంతటి మూర్ఖుడు! నీవు బజార్లోకి వెళ్ళి "అయ్యా! నన్ను మీరెక్కడైనా చూశారా?" అని అడిగితే వారేమనుకుంటారు? నీకు పిచ్చి పట్టిందనుకుంటారు. అదేవిధంగా నీవు వెదుకుతున్న దివ్యత్వం నీయందే ఉన్నది. నీ దృష్టిని అంతర్ముఖం గావించుకున్నప్పుడే ఇట్టి పవిత్రమైన తత్త్వము తెలుస్తుంది. కాని నీవు కేవలం బాహ్యదృష్టితో చూస్తున్నావు. అందుచేత, అన్నింటిలోనూ అంతర్లీనంగా ఉన్న దివ్యత్వము నీకు గోచరించటం లేదు. ఒకసారి కృష్ణుడు అర్జునునితో చెప్పాడు "నాయనా! నేను నీ వాడను, నీవు నావాడవు. నేను నీవు, నీవే నేను" ఇట్టి ఏకత్వాన్ని భావించుకోకుండా నీవు అనేకత్వాన్ని పెంచుకొని దివ్యత్వాన్ని అన్వేషిస్తున్నావు. ఇంతకుముందు ప్రసంగించిన అబ్బాయి చెప్పాడు. భగవంతుని చూడటానికి తానెంతో సాధన చేశానని భగవంతుణ్ణి చూడటానికి ఎక్కడికో వెళ్ళనక్కర్లేదు. ఏ సాధనలూ చేయనక్కర్లేదు.

*సర్వతః పాణిపాదం తత్సర్వతోక్షి శిరోముఖమ్*
*సర్వతః శ్రుతిమల్లోకే సర్వ మావృత్య తిష్ఠతి*

అన్నీ తానైయున్నప్పుడు ఇంక వెతికేది ఎవరిని? నీకు ఏది కనిపిస్తున్నదో అదంతా దైవస్వరూపమే! దైవము లేనటువంటి స్థానము లేదు. దైవము కానట్టి రూపము లేదు.

*ప్రేమరూపము బ్రహ్మంబు ప్రేమమయము*
*ప్రేమను ప్రేమతో సంధింప నీమమగును*
*కాన ప్రేమను గట్టిగ కలిగియున్న*
*అద్వితీయమునొందంగ అర్హుడగును*

కాబట్టి ప్రేమను అభివృద్ధిపరచుకోవాలి. దైవాన్ని వెతికే అవసరం ఏమాత్రం లేదు. దైవమే నీవై ఉన్నావు. సత్యమే నీవై ఉన్నావు. అట్టి సత్యాన్ని వెతికేదెందుకు? దైవము తనకంటే వేరుగా ఉన్నాడని భావించి ఈనాటి మానవుడు ఒక విధమైన పిచ్చి అపోహలో పడిపోతున్నాడు. కృష్ణుడు ఫలానచోట పుట్టాడని, ఫలాన చోట దేహాన్ని విడిచిపెట్టాడని నీవు భావిస్తున్నావు. కాని, కృష్ణుడు ఎక్కడో పుట్టలేదు. ఎక్కడికీ పోలేదు ఎక్కడ చూచినా ఉన్నాడు. నీవు దేనిని చూస్తున్నావో అదంతా కృష్ణస్వరూపమే! రూపనామములు వేర్వేరు గాని, అన్నింటిలో ఉన్న భగవంతుడు ఒక్కడే! అట్టి దైవత్వాన్ని వెతకటం వెఱ్ఱితనం. నీవు కన్నులు మూసుకొని నీలో ఉన్న 'నిన్ను' చూసుకోవటానికి ప్రయత్నించు. 'నేనెవర'ని నిన్ను ప్రశ్న వేసుకో. ఎన్ని సాధనలు చేసినప్పటికీ దేహమే నేననే భావాన్ని నీవు విడువలేకున్నావు. దేహాభిమానాన్ని విడిచిపెట్టు. దేహాభిమానము వలననే "నేను-నీవు" అనే భేదభావము నీలో తలెత్తుతున్నది. "నేను-నీవు" అనే భేదభావమును విసర్జించి అందరూ ఒక్కటే అనే సత్యాన్ని

గుర్తించాలి. కాని నీవు పుట్టినప్పటి నుండి ఈ దేహమే నేను అనే భావాన్ని అలవాటు చేసుకోవటం చేత దేహాభిమానాన్ని త్యజించటం నీకు వీలుకాకున్నది.

## ఏకత్వమే సత్యము, అనేకత్వము కల్పితము

ప్రేమస్వరూపులారా! ప్రేమతత్త్వమనేది మీకు ఎంతవరకు అర్థమయినదో మీరు విచారణ చేయాలి. ప్రేమ అందరిలోనూ సమానంగా ఉన్నది. అయితే మీ దృష్టి, మీ భావములు వేర్వేరుగా ఉండటంచేత వ్యత్యాసము గోచరిస్తున్నది. ప్రేమ ఒక్కటే. సత్య మొక్కటే. దైవమొక్కడే. ఇట్టి ఏకత్వాన్ని మీరు బలపరచుకున్నప్పుడే సత్యాన్ని గుర్తించగలరు. (స్వామితమ చేతిరుమాలును చూపిస్తూ...) ఇదేమిటి? ఇది గుడ్డ. దీని రూపనామములు ఎట్లు ఏర్పడినాయి? ప్రత్తిచేత దారము తయారయింది దారముచేత వస్త్రము ఏర్పడింది. అట్లే సంకల్ప వికల్పముల చేత మనస్సు ఏర్పడింది. సంకల్ప వికల్పములు లేకుండిన మనస్సే లేదు. "ఇది బట్ట." లోతుగా విచారణ చేస్తే "ఇది బట్ట కాదు, దారము." మరింత లోతుగా విచారణ చేస్తే "ఇది దారము కాదు, ప్రత్తి". ఈరీతిగా విచారణ చేస్తూ పోతే కట్టకడపటికి మిగిలేది ఒక్కటే! అదేరీతిగా, సరియైన రీతిగా విచారణ చేస్తూపోతే అన్ని రూప నామములలోనూ అంతర్లీనంగా ఉన్నది దివ్యత్వమొక్కటే అని బోధపడుతుంది. కాని, మీరు విచారణ చేయటంలో పొరపడి సత్యాన్ని గుర్తించలేకపోతున్నారు. ప్రారంభమునుండి మీరు దేహమే నేననే భ్రాంతిని పెంచుకున్నారు. ఏకత్వమే సత్యము. అనేకత్వము కల్పితము. ఈ కల్పితాన్ని దూరం చేసుకోవాలంటే మీ నిజతత్త్వాన్ని మీరు మరిచిపోకుండా ఉండాలి.

## 'నేను నేనే' ఇదే నీవు గుర్తించవలసింది

ఏకత్వాన్ని నీవు మరచిపోకుండా ఉండినంత వరకూ నీవే దైవము. దైవత్వమనేది ఎక్కడో ఉందనుకోవటం పొరపాటు. నీ దృష్టి భిన్నత్వంతో కూడియుండటంచేత దైవత్వము నీకంటే ప్రత్యేకంగా కనిపిస్తున్నది. కనుక నీ దృష్టిని ఏకత్వంగా ఉంచుకో. "నేను నేనే" అని గుర్తించు. ఈ "నేను" అనే దివ్యత్వం అందరిలోనూ ఉన్నది. సాయిబాబాను ఈ దేహ స్వరూపునిగా భావిస్తే నీవు సాయిబాబాకంటే వేరైపోతావు. "నేను నేనే". ఇదే నీవు గుర్తించవలసింది. "నీవు వేరు, నేను వేరు" అనే భేదభావములే మనలను వేరు చేస్తున్నాయి; లోకంలో అనేకత్వం కనిపిస్తున్నది; అనేకత్వాన్ని భావిస్తున్నాము మనము; చాలా పొరపాటు.

అనేకంగా కనిపించేవన్నీ ఏకత్వంతో కూడినవే! అట్టి ఏకత్వమే నీవు. అదే దైవత్వము. అదే "నేను' అనే మూలాధారతత్త్వము. ఒక అద్దాలగదిలో నిలబడి నిన్ను నీవు చూసుకున్నప్పుడు నీకు నీవు ఎంతమందిగానో కనిపిస్తావు. నీకు నీ ప్రతిబింబాన్ని చూపించే అద్దములు వేర్వేరుగా ఉన్నాయిగాని, ప్రతిబింబము ఒక్కటే కదా! అట్టి ఏకత్వమే 'నేను' అనే సత్యాన్ని గుర్తించాలి. ఒక పాత్రలో నీరు పోసి అందులోకి చూసినప్పుడు అక్కడ నీ ముఖమే ప్రతిబింబముగా కనిపిస్తుంది. దేహములనే పాత్రలు వేర్వేరుగా ఉన్నాయిగాని, అన్నింటిలోనూ నీకు నీవే ప్రతిబింబముగా కనిపిస్తున్నావు.

## ఏకత్వాన్ని అనేకత్వంగా చూపించేదే మాయ

ప్రేమస్వరూపులారా! మీరు తెలుసుకోవలసింది ఏకత్వమైన దివ్యత్వాన్ని. ఆ ఒక్కదానిని మీరు తెలుసుకుంటే అన్నీ తెలుసుకున్నవారవుతారు; అన్నీ చూసిన వారవుతారు. ప్రాపంచికదృష్టికి భిన్నంగా కనిపించినప్పటికీ దైవత్వము అంతటా ఏకత్వంగానే ఉన్నది. అట్టి దైవత్వాన్ని మనం చక్కగా చూడవచ్చు. దైవత్వానికి మీరు అనేక రూపనామములు కల్పిస్తున్నారు. ఇది చాలా పొరపాటు. దైవత్వము ఎన్ని రూపములతోనో లేదు. అంతా ఒకటే! 'ఏకం సత్ విప్రాః బహుధా వదంతి'. మీరు చూసేదంతా దైవత్వమే అయినప్పటికీ దానిని అనేకత్వంగా భావిస్తున్నారు. అదే మాయ. ఏకత్వాన్ని అనేకత్వంగా చూపించేదే మాయ. ఉన్నది అనేకత్వం కాదు ఏకత్వమే! భిన్నత్వమనేది కేవలం మీ భ్రాంతియే! భిన్నత్వాన్ని మరచిపోండి. దైవత్వాన్ని

చింతన చేయండి. ఒకానొక సమయంలో రాధ ఆత్మభావాన్ని అభివృద్ధిపరచుకొని కృష్ణుడు తనకంటే వేరుగా లేడని గుర్తించింది. కాని, తక్షణమే దేహ భావానికి లోనై కృష్ణుడు వేరు, తాను వేరు అనుకుంది. అది పొరపాటు! నిజానికి తాను కృష్ణుని కంటే వేరు కాదు. అట్టి ఏకత్వంతోకూడిన కృష్ణుని భిన్నత్వంగా భావించుకోవటం కేవలం భ్రాంతియే తప్ప వేరుకాదు. ఒకసారి నారదుడు రాధతో చెప్పాడు "అమ్మా! నీవు ఎవరివనుకున్నావు? రాధ అనేది కేవలం నీ దేహానికి పెట్టిన పేరు మాత్రమే! కాని, నీవు రాధయే నేననే భ్రమలో మునిగిపోతున్నావు. దేహము నీవు కానే కాదు. అంతా కృష్ణుడే! కృష్ణుని ప్రతిబింబమే నీ స్వరూపంగా కనిపిస్తున్నది."

నీవు చూసేదంతా దైవత్వమేనని భావించు. అతను, ఇతను అనే భేదభావాలకు చోటివ్వకు. అందరూ నీ ప్రతిబింబములేగాని, వేరు కాదు. అంతా నీ 'రిఫ్లెక్షన్' రియాక్షన్, రీసౌండ్'లేనని భావించు. నిన్ను నీవు అద్దములో చూసుకొన్నట్లుగా, నీకు నీవే ఇంకొకరీతిలో 'రిఫ్లెక్షన్'గా కనిపిస్తున్నావు. నీ రూపమే నీకు అనేక రూపములుగా గోచరిస్తున్నది. నిజానికి నీలోనే ఉన్నది దైవత్వము. కాని, ఇంకొకరియందు దైవత్వమున్నట్లుగా కనిపిస్తే నిన్ను నీవు మరచి ఆ వ్యక్తిని దైవంగా భావిస్తున్నావు. 'రిఫ్లెక్షన్, రియాక్షన్, రీసౌండ్'లను చూసి భ్రమించి నీలో ఉన్న **'రియాలిటీ'ని నీవు విస్మరిస్తున్నావు.**

నీవొక కొండప్రాంతానికి పోయి 'ఓ' అని అరిస్తే, తక్షణమే ఇంకొకరు 'ఓ' అని అరచినట్లు వినిసిస్తుంది. ఆ శబ్దము నీదేగాని పరులది కాదు కదా! కాని, అది పరులదిగా భావించి నీవు పొరపడుతున్నావు. ఈ ప్రపంచంలో ఎక్కడ చూసినా మనకు ప్రతిధ్వనులే వినిపిస్తున్నాయి; మన ప్రతిబింబములే కనిపిస్తున్నాయి. అందరూ ప్రతిబింబస్వరూపులే! ఈ ప్రతిబింబములే సత్యమని నీవు భ్రమిస్తున్నావు. ఈ భ్రాంతి ఎప్పుడు నిన్ను వదలునో అప్పుడు నీ బింబము నీకు పూర్తిగా కనిపిస్తుంది. ఏకత్వాన్ని భిన్నత్వంగా భావించి నీవు పొరపడుతున్నావు. కనుకనే, నీ నిజతత్త్వాన్ని నీవు గుర్తించు కోలేకపోతున్నావు.

**ధ్వని – ప్రతిధ్వని**

ఒక గొల్లపిల్లవాడు పశువులను మేపటానికి కొండల చాటుకు పోయాడు. అక్కడ పశువులు గడ్డి మేస్తుంటే అతను కాలక్షేపంకోసం ఏదో పాటను పాడుకోవటం ప్రారంభించాడు. ఎక్కడినుండో ఆ పాట తిరిగి వినిపిస్తున్నది. అది ప్రతిధ్వని అని గుర్తించుకోలేని ఆ అమాయకుడు ఎవరో ఒక వ్యక్తి తాను పాడినట్లే పాడుతూ తనను గేలి చేస్తున్నాడని భావించాడు. "ఎవరు నీవు?" అని గట్టిగా అరిచాడు. ఎక్కడినుండో మళ్ళీ "ఎవరు నీవు?" అని వినిపించింది. వానికి కోపం వచ్చింది. పశువులను తోలుకొని ఇంటికి వెళ్ళాడు. తల్లికి జరిగిన సంగతి వివరించి "అమ్మా! రేపటి దినము నేను పశువులను తోలుకొనిపోను. అక్కడ నాకొక పెద్ద విరోధి ఉన్నాడు. నేను ఏది చెబితే వాడు అదే చెబుతున్నాడు. నేను ఏది పాడితే వాడు అదే పాడుతూ నన్ను గేలి చేస్తున్నాడు" అని చెప్పాడు. అప్పుడు తల్లి అతనికి ధైర్యం చెబుతూ "నాయనా! రేపటి దినము నేనుకూడా నీవెంట వస్తాను" అని చెప్పింది. మరునాడు అతను తల్లిని తీసుకొని ఆ కొండప్రాంతానికి వెళ్ళాడు. గట్టిగా ఒక పాట పాడాడు. ఆ కొండలనుండి ప్రతిధ్వని వినిపించింది. "అమ్మా! విన్నావు కదా! వాడెవడో నేను పాడినట్లే పాడి నన్ను గేలి చేస్తున్నాడు" అన్నాడు. అప్పుడా తల్లి కుమారుని దగ్గరకు తీసికొని "నాయనా! నీవు పొరపడుతున్నావు. ఎవ్వరూ నిన్ను గేలి చేయడం లేదు. అది నీ ప్రతిధ్వనే తప్ప మరొకటి కాదు" అని చెప్పి వానిని సమాధాన పరచింది. ఆ వెఱ్ఱిపిల్లవానివలె ఈనాటి మానవుడు 'ప్రతిబింబాలను' చూసి అవే సత్యమని భావించి చాలా పొరపడుతున్నాడు.

**'నేను దేహము కాదు'**

మీరు దైవాన్ని చూడాలనుకుంటే 'నేను దేహము కాదు' అనే విశ్వాసాన్ని దృఢం చేసుకోండి. దేహమే నేననుకోవటం కేవలం భ్రమ. ఈవిషయాన్ని పిల్లలు చక్కగా అర్థం చేసుకోవాలి. మీరు చూసేవి మీ

ప్రతిబింబములేగాని, వేరు కాదు. మీరు సాయిబాబాను చూస్తున్నామనుకుంటున్నారు. కాని నేను ఈ దేహము కాదు. నేను మీరే, మీరు నేనే. ఈ సత్యాన్ని మీరు పూర్తిగా గుర్తించండి. గుర్తించుకుంటే ఇంక మీకు భేదములే ఉండవు. నీవు ఒకరికి చెంపదెబ్బ కొట్టావు. ఆ దెబ్బ ఎవరికి తగిలింది? నీకే తగిలింది. నీవు ఎవరినో కొట్టాననుకుంటున్నావు. ఎవరినో కాదు, నిన్ను నీవే కొట్టుకున్నావు. అదేవిధంగా, నీవు ఎవరిని దూషించినప్పటికీ నిన్ను నీవే దూషించుకుంటున్నావు.

నీవు అనుభవించే ప్రతి ఒక్కటీ నీకు నీవు చేసుకున్నదేగాని, పరులు చేసినది కాదు. అసలు పరులే లేరు. అంతటా ఉండేది ఒక్కరే. ప్రతి వ్యక్తియందు ఒకే ఆత్మతత్త్వము ప్రకాశిస్తున్నది. కనుక మొట్టమొదట మీ తత్త్వాన్ని మీరు గుర్తించుకోండి. అదే ప్రేమతత్త్వము. ప్రేమ ఒక్కటే. బిడ్డపైన, తల్లిపైన, భార్యపైన, భర్తపైన వీరందరిపైన చూసేది ఒకే ప్రేమయే! వ్యక్తి ఒక్కడేగాని, భావములు వేరువేరు. మనం మూలాధారమైనసత్యాన్ని (Fundamental Truth) చూడాలి. అట్టి సత్యము ఒక్కటే, రెండు లేవు.

**అందరిలోనూ నేనున్నానని భావించండి**

దివ్యాత్మస్వరూపులారా! ఆత్మ ఒక్కటే, రెండు లేవు. అందరి యందున్నది ఒక్కటే, ఒక్కటే అనే సత్యాన్ని మీరు గుర్తించండి. ఎవరికీ భేదములుండవు, ద్వేషములుండవు. ఈ ద్వేషములు, భేదములు సమసిపోవాలంటే అందరిలోనూ నేనున్నానని భావించండి. ఏకత్వాన్ని గుర్తించండి. అప్పుడే మీ సత్యతత్త్వాన్ని మీరు అనుభవించుటకు వీలౌతుంది.

పిల్లలందరూ బాబాపట్ల ఎంతో ప్రేమగా ఉన్నారు. బాబా ప్రేమను అందుకొని ఎంతో ఆనందిస్తున్నారు. అందరినీ ప్రేమించేది బాబా ఒక్కరే. వ్యక్తులు మీకు వేరువేరుగా కనిపిస్తున్నారుగాని, నాకు అందరూ ఒక్కటే. నేనే మీరు, మీరే నేను. ఈ ఏకత్వాన్ని మీరు దృఢంగా నమ్మండి. మీకు భేదములు ఏమాత్రము కనిపించవు. కొన్ని ఆధారములు తీసుకున్నప్పుడు కొంతకాలమునకు మీరు ఏకత్వాన్ని అర్థం చేసుకుంటారు. మీరు కొంత ఓపిక పట్టండి. "నాకు కనిపించటం లేదు. నాకు దర్శనం ఇవ్వటం లేదు" అని నిరాశపడకండి. ఏకత్వాన్ని గుర్తించి, ఏకత్వాన్ని మనస్సులో దృఢంగా పెట్టుకున్నప్పుడు నీకు నీవే సాయిబాబా అవుతావు. 'డివైన్' (దివ్యత్వము) అనేది నీ సహజస్వభావము. కాని, నీవు ప్రాపంచిక కోరికలనే 'డీప్ వైన్' తీసుకోవటం చేత నీయందున్న దివ్యత్వాన్ని నీవు గుర్తించుకోలేకపోతున్నావు. అందరూ దైవస్వరూపులే! నేను మీరే, మీరు నేనే. ఈవిధమైన ఏకత్వాన్ని మీరు పెంచుకుంటూరండి. నాకంటే మీరు వేరుగా లేరు. నేను మీకంటే వేరుగా లేను. నేనూ, నీవూ ఇద్దరం ఒక్కటే. ఈ సత్యాన్ని మీరు గుర్తించి వర్తించినప్పుడు తప్పక కొన్ని దినాలకు ఇద్దరూ ఒక్కటైపోతారు. అప్పుడీ భేదము పూర్తిగా నశించిపోతుంది, ఏకత్వము అర్థమవుతుంది.

(తేదీ 21.03.2004 సాయంత్రం సాయికుల్వంత్ సభామండపంలో శ్రీవారు అనుగ్రహించిన దివ్యసందేశము)